
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట
5
గురువారం 17 జూలై 2025





కోహెడలో ఏర్పాటు చేస్తున్న సభాస్థలి

గవర్నర్ పర్యటనకు
పటిష్ఠ బందోబస్తు

- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, సీపీ

కోహెడ, జూలై16(ఆంధ్రజ్యోతి) : కోహెడ మండల కేంద్రంలో గురువారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పర్యటించనున్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, గడ్డం వివేక్, కొండా సురేఖ, సీతక్క కూడా పాల్గొంటారు. ఉదయం 10.30గంటలకు బస్వాపూర్‌లో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్, మధ్యాహ్నం 3.30 గంటలకు కోహెడలో స్టీల్ బ్యాంకు ప్రారంభ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ హైమావతి మూడు రోజులుగా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి మొదటిసారి గవర్నర్ వస్తుండడంతో 446 పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.



కోహెడలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

కోమటి చెరువుపై కారు మబ్బులు



సిద్దిపేట పట్టణంలో సాయంకాలం కోమటి చెరువు పరిసర ప్రాంతాల్లో ఆకాశంలో ఇలా... తివాచీ పరిచినట్లు మేఘాలు కమ్ముకుని కనువిందు చేశాయి. మబ్బులు కరిగి వర్షం కురిస్తే సందర్శకులు స్థానికులు మాట్లాడుకోవడం కనిపించింది. కొందరు తమ సెల్‌ఫోన్ల చిత్రాలను బంధించారు.
- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్



సర్కార్‌కు నై.. ప్రైవేటుకు సై

- ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు అంతంత మాత్రమే
- శిథిలావస్థలోని భవనాలు, వసతుల లేమినే కారణం
- ప్రైవేటు యాజమాన్యాల ఆర్భాటపు ప్రకటనలకు ఆకర్షితులవుతున్న పిల్లల తల్లిదండ్రులు 7

ఇంకెప్పుడు?

- ప్రభుత్వ కార్యాలయాలకు.. సొంత భవనాలు కరువు
- నారాయణరావుపేట మండలం ఏర్పాటై ఆరేళ్లు
- పాఠశాల భవనంలో అరకొర వసతుల మధ్య ప్రధాన కార్యాలయాలు
- వేర్వేరు మండలాల్లో వివిధ శాఖలు
- స్థలాలున్నా నిధులు విడుదల చేయని వైనం 8

ఇందిరమ్మ ఇళ్లకు
ఒక స్తంభం ఉచితం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అదనంగా అవసరముంటే ఒక్కో స్తంభానికి రూ.8వేలు

- కేటగిరీ-2 కింద మీటరు కనెక్షన్
- చెల్లించాల్సింది రూ. 4,050
- విద్యుత్ సిబ్బందికి, అధికారులకు నగదు ఇవ్వొద్దు
- అన్ని డీడీ రూపంలోనే చెల్లించాలి
- లబ్ధిదారులు ముందుగా విద్యుత్ వినియోగ కేంద్రంలో సంప్రదించాలి
- ఇబ్బందులుంటే అధికారుల దృష్టికి తేవాలి
- విద్యుత్ శాఖ ఎస్ఈ టీఆర్ చంద్రమోహన్
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై శాఖలో చర్చ



సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూలై 16: ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించాలంటే, ఎదుర్కొంటున్న సమస్యలపై బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన 'ఆదిలోనే అవాంతరాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కరెంటు కష్టాలు' కథనానికి విద్యుత్ శాఖ ఎస్ఈ టీఆర్ చంద్రమోహన్ స్పందించారు. కథనంపై ఆ శాఖలో పలువురు అధికారులు, సిబ్బంది చర్చించుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా అవసరమయ్యే విద్యుత్ మీటరు కనెక్షన్ కోసం కేటగిరీ-2 కింద రూ.4,050 డీడీ రూపేణ చెల్లిస్తే ఒక స్తంభంతో పాటు అవసరమైన కేబుల్, కాసారాలు, స్తంభం ఏర్పాటు కూలీ, మరో 10 రకాల సర్వీసులను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.

వినియోగ కేంద్రంలో సంప్రదించాలి

కరెంటు కనెక్షన్ కావాలంటే విద్యుత్ కార్యాలయంలోని వినియోగదారుల కేంద్రంలో సంప్రదించాలి. దరఖాస్తును నింపి రూ. 4,050 డీడీ చెల్లించాలి. కనెక్షన్ అవసరమున్న స్థలానికి సంబంధిత అధికారులు వచ్చి, అక్కడ ఎన్ని స్తంభాలు, ఎంత కేబుల్ అవసరమో అంచనా వేస్తారు. ఆ ప్రకారం 30 మీటర్ల వరకు ఉంటే గనుక ఒక స్తంభం, కేబుల్, అవసరమయ్యే మెటీరియల్ మీటరుకు చెల్లించిన (పైన పేర్కొన మీటరు ధర) వాటితోనే ఉచితంగా అందిస్తారు. అదనంగా ఎక్కువ స్తంభాలు అవసరముంటే విద్యుత్ సంస్థ నిర్ణయించిన ధర రూ. 8 వేల లోపు డీడీ చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కోచోట 5 అవసరమున్నా సరే ఒక్క స్తం భం పోనూ మిగతా స్తంభాలకు డబ్బు చెల్లించక తప్పదు.

నిర్మాణం పూర్తయితే...

కేటగిరి-2 కింద కనెక్షన్ పొందిన వినియోగదారుడి ఇంటి నిర్మాణం పూర్తయితే కేటగిరీ-2 నుంచి కేటగిరీ-1కు కనెక్షన్‌ను మార్చనున్నారు. కేటగిరీ-2 కింద నిర్మాణ సమయంలో ఒక్క యూనిట్‌కు రూ.5.40కు పైగా ఖర్చు అవుతుండగా, నిర్మాణం పూర్తయితే కేటగిరీ-1 డొమెస్టిక్ కింద వర్తించనున్నది. దీంతో కేటగిరీ-1 కింద లబ్ధిదారులు, ఇంటి యజమానులకు ఒక్క యూనిట్‌కు రూ. 1.99 చొప్పు బిల్లు

మిగతా 8వ పేజీలో

జిల్లాలోని విద్యుత్ అధికారుల ఫోన్‌నంబర్లు

	సిద్దిపేట డివిజన్	
1.	డీఈ సిద్దిపేట	8712471077
2.	ఏడీఈ సిద్దిపేట టౌన్	8712471078
3.	ఏడీఈ సిద్దిపేట రూరల్	8712471084
4.	ఏడీఈ సిద్దిపేట దుబ్బాక	8712471042
5.	సిద్దిపేట కంట్రోల్ రూమ్	8712471088
6.	సర్కిల్ కంట్రోల్ రూమ్	8712471037
	గజ్వేల్ డివిజన్	
1.	డీఈ గజ్వేల్	8712471176
2.	ఏడీఈ ములుగు	8712471305
3.	ఏడీఈ గజ్వేల్	8712471182
4.	ఏడీఈ తుక్కాపూర్	8712471243
	హుస్నాబాద్ డివిజన్	
1.	డీఈ హుస్నాబాద్	8712471311
2.	ఏడీఈ హుస్నాబాద్	8712471337
3.	ఏడీఈ బెజ్జంకి	8712471358
4.	ఏడీఈ చేర్యాల	8712471335

హామీల అమలు చేతకాకపోతే
రాజీనామా చెయ్

- దివ్యాంగులకు పెన్షన్ పెంచడంలో కాంగ్రెస్ విఫలం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

సిద్దిపేట అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు 19 నెలలు గడుస్తున్నా వారి పెన్షన్ పెంచడంతో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, హామీలు అమలు చేయడం చేతకాకపోతే సీఎం రాజీనామా చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. ఏపీలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ పెంచి ఇస్తున్నారని, తెలంగాణ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన దివ్యాంగుల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పెన్షన్ తీసుకునేది నూటికి 99 శాతం పేదలేనని, రుణమాఫీపై ప్రశ్నించే ప్రతిపక్షాలు పెండింగ్ పెన్షన్ గురించి ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. అసెంబ్లీలో అన్ని పార్టీలు ఉండగా ఈ విషయంలో ఒక్క ఎమ్మార్పీఎస్ మాత్రమే ఉందుకు కొట్లాడాలని ప్రశ్నించారు. రైతు భరోసా పేరిట డబ్బులు వేస్తున్న ప్రభుత్వం కౌలు రైతులను ఎందుకు పట్టించుకోవడం లేదని అన్నారు. తమ పోరాటం ద్వారానే ఆరోగ్యశ్రీ పథకం వచ్చిందని గుర్తు చేశారు. 2004లో కాంగ్రెస్ మేనిఫెస్టోలో రూ.200 పెన్షన్ పెట్టిందని, 2007లో హక్కుల పోరాట సమితి ఏర్పాటు చేసి అప్పటి నుంచి దివ్యాంగుల కోసం పోరాటాలు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఓ దివ్యాంగుడిని మందకృష్ణ ముందు ఉంచి, ఓ తల్లి తన గోడును వెళ్లబోసుకుంది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్ మాదిగ, సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, నాయకులు పాల సాయిరాం, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు దండు శంకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు యాదగిరి, సంపత్, శ్రీశైలం, నారాయణ యాదగిరి, రమేష్, పెర్క పరశురాములు, రాజు, రమేష్, మల్లేశం, లక్ష్మణ్ పాల్గొన్నారు.



మందకృష్ణతో తమ గోడు చెప్పుకుంటున్న మహిళ

ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

- సీపీ అనురాధ

సిద్దిపేట అర్బన్ / కోహెడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని స్థానిక సమరంపై సిద్ధంగా ఉండాలని పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సీఐ విద్యాసాగర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు రికార్డ్స్ సీసీటీ ఎస్ఎస్ డాటా అప్‌డేట్ చాలా బాగుందని సీఐతో పాటు సిబ్బందిని అభినందించారు. అలాగే కోహెడ పోలీస్‌స్టేషన్‌ను సీపీ అనురాధ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసర ప్రాం తాలను, సీజ్ చేసిన వాహనాలు, రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు.



మద్యం అమ్మకాలు చేపట్టవద్దని తీర్మానం చేసిన మహిళలు

మా ఊర్లో మద్యం వద్దు

- బెల్టుషాపుల్లో అమ్మొద్దు
- గ్రామంలో తిరుగుతూ డప్పు చాటింపు
- సంతకాల సేకరణ, ఎక్సైజ్ పోలీసులకు అందజేత
- పెద్దమాసాన్‌పల్లిలో తీర్మానం చేసిన మహిళలు

తొగుట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మద్యం మహమ్మారిని అరికట్టేందుకు నారీలోకం కదం తొక్కింది. అనుకున్నదే తడవుగా మహిళలు, యువకులతో కలిసి గ్రామంలో తిరుగుతూ డప్పు చాటింపు వేయిస్తూ కలియతిరిగారు. గ్రామచావిడి వద్దకు ర్యాలీగా చేరుకుని బెల్టుషాపుల్లో మద్యం అమ్మకాలు, కొనుగోళ్లు చేపట్టవద్దని బుధవారం తీర్మానం చేశారు. తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లిలో సుమారు 10 వరకు బెల్టుషాపులున్నాయి. అయా దుకాణాల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గ్రామంలో చాలా మంది మద్యానికి బానిసవుతున్నారని, యువకులు కూడా అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆరోపించారు. మద్యం మత్తులో మహిళలతో, యువతులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో, చెరువు కట్టలపై, క్రీడామైదానాలు, ఎల్లమ్మ ఆలయం వద్ద యువకులు నిత్యం మద్యం తాగుతూ పరిసరాలను పాడుచేస్తున్నారని ఆరోపించారు. ఇక నుంచి గ్రామంలో ఎవరైనా మద్యం తాగినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సంతకాలు చేసిన లేఖను మిరుదొడ్డి ఎక్సైజ్ పోలీసులకు అందజేశారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి

- చేర్యాలలో జేఏసీ ఆధ్వర్యంలో మానవహారం

చేర్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంగడి బజారు చౌరస్తా వద్ద జనగామ-సిద్దిపేట జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల జేఏసీ నాయకులు, ప్రైవేటు కళాశాలల విద్యార్థులతో కలిసి స్థానిక అంగడిబజారు వరకు ర్యాలీ చేపట్టి ఆందోళన నిర్వహించారు.. అనంతరం జేఏసీ ప్రతినిధులు వకుళాభ రణం నర్సయ్య, ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ చేస్తామన్న హామీని సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చాలన్నారు. లేదంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో తగిన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పద్మ, సిద్దప్ప, సంజీవులు, మల్లేశం, తిరుపతిరెడ్డి, సురేశ్, నారాయణరెడ్డి, బాల నర్సయ్య, రాజేందర్, శ్రీధర్‌రెడ్డి, కరుణాకర్, కీర్తన, నాగేశ్వర్‌రావు, చంటి తదితరులు పాల్గొన్నారు.



పార్టీని బలోపేతం చేద్దాం

- హుస్నాబాద్‌లో సీపీఐ జిల్లా మహాసభ..
- హాజరైన కూనమనేని, చాడ
- తరలివచ్చిన కార్యకర్తలు..
- డప్పు నృత్యాలు, కోలాటాలు హోరెత్తిన నినాదాలు..

హుస్నాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ప్రజల కోసం పోరాటాలు చేస్తున్న కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేద్దామని పార్టీ శ్రేణులు ప్రతినబూనారు. అసమానతలు లేకుండా, అందరు సమానంగా ఉండాలనే లక్ష్యంతో పుట్టిన కమ్యూనిస్టు పార్టీ ప్రజల్లో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం హుస్నాబాద్‌లోని ఓ గార్డెన్‌లో జరిగిన సీపీఐ నాలుగవ జిల్లా మహాసభలు విజయవంతం అయ్యాయి. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డితో పాటు జిల్లాలోని వివిధ మండలాల నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి మల్లెచెట్టు చౌరస్తా మీదుగా గార్డెన్ వరకు జరిగిన ర్యాలీలో మహిళల డప్పు నృత్యాలు, కోలాటాలు, కార్యకర్తల నినాదాలతో హోరెత్తించారు. ర్యాలీలో సీపీఐ నేతలు కూనమనేని, చాడలు కార్యకర్తలతో కలసివచ్చారు. అనంతరం జరిగిన సమావేశంలో సీపీఐ ఉద్యమాలు, చరిత్ర, ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసుకోవడానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. కమ్యూనిస్టు పార్టీని చిన్న పార్టీ అనుకోవద్దని, ప్రపంచలో అతిపెద్దదైన పార్టీ కమ్యూనిస్టుయేనని సాంబశివరావు కార్యకర్తలకు

మిగతా 8వ పేజీలో



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు

ఎంపీటీసీ, జడ్పీటీసీ
స్థానాలు ఖరారు

ఉమ్మడి జిల్లాలో 73 మండల పరిషత్‌లు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 16 : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల సంఖ్యను బుధవారం ఖరారు చేశారు. జిల్లాల వారీగా జాబితాను వెలువరించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 73 మండల పరిషత్‌లు ఉన్నట్లుగా లెక్క తేల్చారు. ముందే ఈ జాబితా తెరమీదకు రావడంతో గ్రామపంచాయతీ ఎన్నికలను మరింత ఆలస్యంగా నిర్వహించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. మండలాల వారీగా ఖరారైన ఎంపీటీసీ స్థానాలు ఎన్ని.. ఏయే రిజర్వేషన్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి.. అనే ప్రశ్నలకు సమాధానాలు వెతకడంపై ఆశావహులు దృష్టి సారించారు.





ఉమ్మడి జిల్లాలో స్థానాల సంఖ్య

సంగారెడ్డి	జడ్పీటీసీ	26
	ఎంపీటీసీలు	271
సిద్దిపేట	జడ్పీటీసీ	26
	ఎంపీటీసీలు	230
మెదక్	జడ్పీటీసీ	21
	ఎంపీటీసీలు	190

ప్రకృతి ఒడి.. సర్కారు బడి 8







ఎల్లుండి జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

మెదక్ అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మెదక్ స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. 11వ తెలంగాణ స్టేట్ జూనియర్ అండ్ సీనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల కోసం ఈ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్-14,16,18 బాలబాలికలకు రన్స్, త్రో గేమ్స్ విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు వచ్చే నెల 3, 4న వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారని ఆయన వెల్లడించారు. మిగితా వివరాలకు 9963005540 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.







దివ్యాంగుల యూడీఐడీ కార్డులతో బహుళ ప్రయోజనాలు

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్
- జిల్లా ఆసుపత్రిలో ఫిజియోథెరపీ సెంటర్ ఏర్పాటు
- 300మంది దివ్యాంగులకు యూడీఐడీ సర్టిఫికెట్స్ జారీ


దివ్యాంగులతో మాట్లాడుతూన్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ కల్చరల్ జూలై 16 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు యూడీఐడీ కార్డు మంజూరీ క్యాంపును బుధవారం మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ దివ్యాంగుల యూడీఐడీ కార్డుతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని అన్నారు. ఫిజియోథెరపీ యూనిట్, వృద్ధుల విభాగం రోగులతో మాట్లాడి వారి వైద్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులకు జాతీయ డేటాబేస్‌ను రూపొందించడానికి ప్రతి వ్యక్తికి ప్రత్యేక దివ్యాంగుల గుర్తింపు కార్డు యూనిక్ డిసబిలిటీ ఐడెంటిఫికేషన్ కార్డ్‌ను జారీ చేయడానికి ప్రత్యేక ప్రాజెక్ట్ అమలు చేస్తున్నామన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాంపు నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు గడిచిన నెల రోజుల్లో 300 మంది దివ్యాంగులకు యూడీఐడీ కార్డ్స్ జారీ చేశామని, స్లాట్ బుక్ చేసుకుని ఇంకా 150 మంది మిగిలి ఉన్నారని అన్నారు. 21 రోజుల్లో స్పెషల్ క్యాంపు ఏర్పాటు చేసి దివ్యాంగులకు యూడీఐడీకార్డ్స్ మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరెండెంట్ డాక్టర్ సునీత, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శివ దయాల్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు, వైద్యాధికారులు పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్ పాఠశాలల విద్యతోనే సాధ్యం

కొల్చారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కొల్చారం మండలం దేశ్య తండా ప్రాథమిక పాఠశాలను మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి పాఠశాలకు రాని విద్యార్థుల గురించి ఉపాధ్యాయులను అడిగి ఆరా తీశారు. వరుసగా రెండు మూడు రోజులుగా పాఠశాలలకు రాని విద్యార్థుల ఇళ్లు తిరిగి పాఠశాలకు విద్యార్థులను ఎందుకు పంపడం లేదని విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సోషల్ మీడియా కట్టడి తప్పదు

గజ్వేల్/వర్గల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు సమాజాన్ని చైతన్య పరచడం ద్వారా విప్లవాన్ని సృష్టించవచ్చని రాష్ట్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్, సీనియర్ పాత్రికేయులు ఆర్. దిలీప్‌రెడ్డి అన్నారు. వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లిలోని టీజీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన 'సమకాలీన సమాజం-జర్నలిస్టుల పాత్ర' అంశంపై నిర్వహించిన సదస్సు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సోషల్ మీడియాకు గేట్‌వే లేదని, సమాజమే పరిమితిని విధించాలన్నారు. సోషల్ మీడియాకు సైతం త్వరలోనే చెక్ పడబోతుందని, చట్టపరమైన పరిమితులు ఏర్పాటు చేయబోతున్నారని చెప్పారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరాహత్ అలీ మాట్లాడుతూ.. గజ్వేల్ ప్రెస్‌క్లబ్ అన్ని ప్రెస్‌క్లబ్‌లకు భిన్నమైనదని, గొంతు లేని ప్రజలకు గొంతుగా నిలిచిందని, ప్రజాకాంక్షలకు అనుగుణంగా పనిచేసిందన్నారు.

ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, వంటిమామిడి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్తా, తహసీల్దార్ బాలరాజు, నవోదయ పాఠశాల ప్రిన్సిపల్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాచన్న స్వామి హుండీ ఆదాయం రూ.3.37 లక్షలు


రాచన్న స్వామి ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కోహీర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల శ్రీ రాచన్న స్వామి దేవాలయంలో బుధవారం స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మార్చి 27వ తేదీ నుంచి జూలై 16వ తేదీ వరకు భక్తులు స్వామి వారికి సమర్పించుకున్న హుండీ ఆదాయం రూ.3,37,896లు వచ్చినట్లు ఆలయ ఈవో శివరుద్రప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు శ్రీనివాస్, ఆలయకమిటి సభ్యులు దయానంద్‌పాటిల్, గోపాల్, రమేష్, రాజన్న, రాచన్న, చెన్నప్ప, మహేష్, మున్నూరు రాజు, నాచం నగేష్, బస్వరాజ్, అంజన్న, శివానంద్, శివరాజ్‌స్వామి సోమలింగం, ప్రతాప్‌రెడ్డి, సిద్దయ్య స్వామి ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు నిరసన


అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతు ఎల్లారెడ్డి

అక్కన్నపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ పట్టించుకోవడం లేదంటూ బుధవారం అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓ రైతు తన కుమారుడితో కలిసి నిరసనకు దిగాడు. మండలంలోని గోవర్దనగిరి గ్రామానికి చెందిన చిలుపూరి ఎల్లారెడ్డి అనే రైతుకు సర్వే నంబర్‌లు 266, 267లో 23 ఎకరాల భూమి ఉంది. ధరణి పోర్టల్‌లో ఉన్న తన భూమిని రెవెన్యూ అధికారులు బ్లాకు లిస్టులో పెట్టారని ఆరోపించారు. తన భూమిని ఎందుకు బ్లాక్ లిస్టులో పెట్టారని, బ్లాక్ లిస్టు నుంచి తొలగించాలని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోకపోవడంతో సిద్దిపేట కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ఐదు సార్లు దరఖాస్తులు సమర్పించాడు. అయినా ఫలితం లేకపోవడంతో ఈనెల 7న సిద్దిపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీజిల్ ప్యాకెట్‌తో వచ్చాడు. పోలీసులు తనిఖీ చేయగా అతని వద్ద డీజిల్ ప్యాకెట్ లభించింది. ఈ సంఘటన గురించి పత్రికల ద్వారా తెలుసుకున్న రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి ఆ రైతు భూ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అయినా తహసీల్దార్ తన భూమిని బ్లాక్ లిస్టులో నుంచి తీయడం కుదరదని చెప్పాడని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి తన సమస్యను పరిష్కరించాలని ఎల్లారెడ్డి కోరారు.

గంజాయితో పట్టుబడ్డ యువకుడు అరెస్ట్

ములుగు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న ఓ యువకుడిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ములుగు పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ములుగు మండలం మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన ఉప్పరి మణికంఠ ఈ నెల 15న మధువన్ వెంచర్ వద్ద గంజాయి అమ్ముతున్నాడన్న సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ములుగు ఎస్సై విజయ్‌కుమార్ సిబ్బందితో కలిసి వెళ్లి దాడి చేసి నిందితుడిని పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 130 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

కోతి దాడిలో మహిళకు గాయాలు

కొమురవెల్లి, జూలై16 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చి బస చేసిన గది ముందు కూర్చున్న మహిళపై బుధవారం కోతి దాడి చేసింది. దీంతో మహిళ చేతికి గాయాలయ్యాయి. బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లాకు చెందిన లావుడ్య శాంతి మల్లికార్జున స్వామికి బోనం చెల్లించి దర్శనం చేసుకున్న తర్వాత తిరిగి వచ్చి బస చేసిన గది ముందు కూర్చొని కుటుంబ సభ్యుల కోసం వేచి చూస్తోంది. అప్పుడు కోతి దాడి చేయడంతో చేతికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కోతిని వెళ్లగొట్టారు. కొమురవెల్లిలో కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ భక్తులతో పాటు, స్థానికులను గాయాల పాలు చేస్తున్నాయని, ఆలయ అధికారులు కోతుల బెడద నుంచి భక్తులకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని భక్తులతో పాటు స్థానికులు కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

బెజ్జంకి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం బెజ్జంకి మండలం బేగంపేటలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు బేగంపేటకు చెందిన పగోలం రాజేశం (39) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రాజేశానికి భార్య భాగ్యలక్ష్మీ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గ్రామంలో ఇంటి నిర్మాణం కోసం, కుటుంబ పోషణ కోసం రాజేశం అప్పులు చేశాడు. చేసిన అప్పులు, ఆర్థిక ఇబ్బందులు ఎక్కువై మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాజేశం ఆటో తీసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు రాజేశాన్ని సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శంకర్‌రావు తెలిపారు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వట్‌పల్లి, జూలై16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఖదిరాబాద్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై లవకుమార్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖదిరాబాద్ గ్రామానికి చెందిన చాకలి యాదయ్య(47) ఈనెల 11న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు జోగిపేట ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు.

వ్యవసాయ బావిలో మృతదేహం

రేగోడు జూలై16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచారం గ్రామ శివారులో ప్రధాన రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో బుధవారం మృతదేహం లభ్యమయింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని బయటకి తీయగా రేగోడు గ్రామానికి చెందిన ఉబ్బి పెంటయ్య(18)గా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

నర్సాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్‌ఐటీలో బీటెక్ చదువుతున్న ఓ విద్యార్థి ప్రైవేటు హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పూడూరుకు చెందిన తరుణ్(20) ఇక్కడి బీవీఆర్‌ఐటీలో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. పట్టణంలోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉండే తరుణ్ బుధవారం సాయంత్రం గదిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన అక్కడి వారు కిందికి దించి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే, విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

యువకుడి అదృశ్యం

నర్సాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని ఓ పెట్రోల్ బంకులో పనిచేసే ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. బుధవారం సాయంత్రం ఎస్సై జగన్నాథం విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని సీతారాంపూర్‌కి చెందిన వెల్కన్న జగన్ అనే యువకుడు నర్సాపూర్‌లోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తాడు. ఈ నెల 11వ తేదీన పెట్రోలు బంకుకు వెళ్తున్నానని చెప్పి ఇంటికి తిరిగిరాలేదు. ఆ రోజు నుంచి ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబీకులు బుధవారం పోలీసులను ఆశ్రయించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగన్నాథం తెలిపారు.

హత్యాయత్నానికి దారి తీసిన..

నిజాంపేట,జూలై 16 (ఆంధ్రజ్యోతి): భూమి గొడవలు హత్యాయత్నానికి దారితీశాయి. సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసిన పోలీసులు. బుధవారం రిమాండ్ చేశారు. నిజాంపేట ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నార్లాపూర్ గ్రామానికి చెందిన పట్నం రాజు, పట్నం అశోక్, శ్రీశైలం వీరి మధ్య కొన్నేళ్లుగా భూ -వివాదం నడుస్తుంది. ఇది మనసులో పెట్టుకున్న పట్నం అశోక్, శ్రీశైలం కలిసి వ్యవసాయ పనులలో నిమగ్నమైన పట్నం రాజు తలపై పారా, కట్టెలతో కొట్టి గాయపరిచారు. ఆ సమయంలో పక్క పొలాల్లో ఉన్న వారు చేరుకొని ఆపడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదయింది.

బండ్లు ఆగం.. ఒళ్లు హూనం



గుంతల మయంగా ఖానాపూర్-బడంపేట గ్రామాల రోడ్డుపై గుంతలో నిలిచిన నీరు



కోహీర్ మండలంలోని మనియార్‌పల్లి-బడంపేట గ్రామాల మధ్య రోడ్డు దుస్థితి

కోహీర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని దాదాపు 90 కిలోమీటర్ల అంతర్గత రహదారులు అధ్వాన్నంగా మారాయి. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రోడ్లనే ఆనవాళ్లు కూడా కనిపించకుండా పోయాయి. మండలంలోని ఏ గ్రామానికి వెళ్లాలన్నా గుంతల రోడ్లపై నుంచే ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో ఒళ్లంతా హూనమై ఆస్పత్రుల పాలైతే.. వాహనాలు పాడై షెడ్లకు తీసుకెళ్లాల్సి దుస్థితి నెలకొన్నదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక రాత్రివేళల్లో ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. పీచేర్యాడి గ్రామం నుంచి పీచేర్యాడి తండా వరకు ఉన్న 7 కిలోమీటర్ల రోడ్డు కంకర తేలి పూర్తిగా అధ్వాన్నంగా మారడంతో గిరిజన తండా వాసులు నిత్యం నరకం చూస్తున్నారు. అలాగే పీచేర్యాగడి పాత తండా నుంచి కొత్త తండా మీదుగా పర్షపల్లి గ్రామం వరకు 5 కిలోమీటర్లు, బడంపేట నుంచి మనియార్‌పల్లి గ్రామం వరకు, 65వ జాతీయ రహదారి నుంచి వెంకటాపూర్, పోతిరెడ్డిపల్లి గ్రామాల మీదుగా 15 కిలోమీటర్ల రహదారులు సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ రోడ్లను బాగుచేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా స్పందించి పాడైన రోడ్లను బాగుచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలి అధ్వానంగా మారిన పిచేర్యాగడి తండా రోడ్డు



కోహీర్ నుంచి పైడిగుమ్మల్, రాజనెల్లి గ్రామాలకు వెళ్లే దారిపై గుంతలు

సర్కార్‌కు నై.. ప్రైవేటుకు సై

- ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు అంతంతమాత్రమే
- శిథిలావస్థలోని భవనాలు, వసతుల లేమినే కారణం
- ప్రైవేటు యాజమాన్యాల ఆర్భాటపు ప్రకటనలకు ఆకర్షితులవుతున్న పిల్లల తల్లిదండ్రులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికల సంఖ్య రోజురోజుకూ తగ్గుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించడానికి ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు ప్రభుత్వ బడులంటే మాత్రం ససేమిరా అంటున్నారు. వేలకు వేలు ఖర్చైనా సరే ప్రైవేటు, కార్పొరేట్ బడుల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలు విద్యార్థుల్లేక వెలవెలబోతున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో అన్నీ తరగతులకు కలిపి 25లోపే విద్యార్థులున్నారంటే.. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. శిథిలావస్థకు చేరిన భవనాలు, అరకొర వసతులే ఇందుకు కారణంగా తెలుస్తున్నది.

కొండాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి సరైన సమయంలో నిధులు అందకపోవడం, పనులలో జాప్యం జరగడం, అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల నాణ్యత లోపాలు వంటివి ప్రధాన కారణాలతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించడం లేదు. అంతేకాకుండా ప్రైవేటు పాఠశాలలు అందమైన కరపత్రాలు, ఆకర్షణీయమైన మాటలతో తల్లిదండ్రులను ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేక బోధన, ర్యాంకులు, డిజిటల్ బోర్డులు, వివిధ పాఠ్యపుస్తకాలు, కోర్సులు, అందమైన భవనాలు, బస్సు సౌకర్యాలు వంటివి చూపి లక్షల ఫీజులు వసూలు చేస్తున్నాయి. పక్కవారి పిల్లల చేరికలను ఆదర్శంగా చూపి, తమ పిల్లల భవిష్యత్తు కోసం ప్రైవేటుపాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులను ప్రభావితం చేస్తున్నాయి. కొండాపూర్ మండల పరిధిలో 56 అంగన్‌వాడీ కేంద్రాలు, 32 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 11ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థుల అడ్మిషన్లు లేకపోవడంతో 2 ప్రాథమిక పాఠశాలలను మూసివేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు

మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివిన 8 మంది విద్యార్థులు మొదటి విడత కౌన్సిలింగ్‌లోనే బాసర ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారని ఎంఈఓ దశరథ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధనలభిస్తుందన్నారు. పది పరీక్షల్లో కొండాపూర్ మండల ఉన్నత పాఠశాలల విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలన్నారు.



హరిదాస్‌పూర్ తమ్మళిబాయ్ పాఠశాలలో ముగ్గురే విద్యార్థులు

జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో అస్తవ్యస్తం

జహీరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కొరవడటం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, దీంతో గ్రామీణ నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వ విద్య అందని ద్రాక్షలా మారుతోందని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వాలు కార్పొరేట్ తరహా విద్యను అందిస్తామని ప్రగల్భాలు పలికినా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. తమ పిల్లలు ప్రయోజకులవ్వాలంటే ప్రైవేటు పాఠశాలల్లోనే చదవాలని భావించి, అధిక ఫీజులు చెల్లిస్తూ ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది.



మూడ్‌తండా ఐదురు విద్యార్థులకు బోధన

5 తరగతులు, 25 దాటని విద్యార్థులు

జహీరాబాద్ మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి 80వరకు ఉన్నాయి. అందులో ప్రస్తుతం 6వేల పైచిలుకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మండలంలోని 9 ప్రాథమిక పాఠశాలల్లో 5 తరగతులకు గాను విద్యార్థుల సంఖ్య 25 దాటని పరిస్థితి ఉన్నది. మొగుడంపల్లి మండలంలోనూ ఇదే పరిస్థితి ఉంది. పలు ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, మంచినీరు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ కింద నల్లా కనెక్షన్లు ఇచ్చినప్పటికీ నీరు రావడం లేదని ఉపాధ్యాయులు, గ్రామస్థులు తెలిపారు. మౌలిక వసతులు కల్పనలో పాలకులు, అధికారులు విఫలమయ్యారని గ్రామస్థులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించి, విద్యావ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

టీ మాందాపూర్ బడిలో నాగుపాము కలకలం

చిన్నశంకరంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీ మాందాపూర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం నాగుపాము కలకలం సృష్టించింది. ఉదయం పాఠశాల సిబ్బంది తరగతి గదులను శుభ్రం చేస్తున్న సమయంలో తరగతి గదిలోని నాగుపాము బుసకొడుతూ పరుగులు తీసింది. దీంతో విద్యార్థులు భయంతో పరుగులు తీశారు. స్థానికుల సహాయంతో నాగుపామును కర్రలతో చంపేశారు. .

ఐదు తరగతులకు ఇద్దరే టీచర్లు

- ఒకే తరగతి గదిలో బోధన



నర్సాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలోని జగన్నాథరావు కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యాబోధన గందరగోళంగా మారింది. ఒకే గదిలో ఐదు తరగతుల విద్యార్థులకు ఇద్దరు టీచర్లు బోధన చేస్తుండటం గమనార్హం. ఈ పాఠశాలకు రెండు గదులు ఉండగా, ఒక గదిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో మిగిలిన ఒకే గదిలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు 30 మందికి పైగా విద్యార్థులకు బోధన సాగుతోంది. ఇద్దరు టీచర్లు ఒకే గదిలో ఐదు తరగతులకు పాఠాలు చెబుతుండటంతో, ఏ తరగతికి ఏ పాఠం చెబుతున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దీనివల్ల ఉపాధ్యాయులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

బోరుమోటారు పనిచేయక విద్యార్థుల ఇక్కట్లు

నర్సాపూర్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో రెండు రోజులుగా బోరుమోటారు పనిచేయకపోవడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ;ఓ ఇంటి వద్ద ఉన్న నల్లా పైపు వద్ద ప్లేట్లు కడుక్కోవాల్సి వస్తుంది. తాగడానికి కూడా అదే నీరు శరణ్యమైంది.

నేటి నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

సిద్దిపేట కల్చరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ సైన్స్ సబ్జెక్టుకు సంబంధించిన ప్రయోగ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. డిగ్రీ ఫస్టియర్ మొదటి సెమిస్టర్, సెకండియర్ మూడవ సెమిస్టర్, ఫైనలియర్ ఐదవ సెమిస్టర్ సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 17 నుంచి 26 వరకు జరుగుతాయని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సిద్దిపేట సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ డా. శ్రద్ధానందం తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉంటాయన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు కళాశాల గుర్తింపు కార్డు, హాల్ టికెట్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సిద్దిపేట ప్రాంతీయ అభ్యాసకుల సహాయక కేంద్రంలో గానీ ఫోన్ నంబర్ 7382929615 ద్వారా సంప్రదించవచ్చన్నారు.

కాంగ్రెస్ నాయకులకే ఇందిరమ్మ ఇళ్లు

- ఎంపీ రఘునందన్‌రావు



పార్టీలో చేరిన వారితో ఎంపీ రఘునందన్‌రావు

గజ్వేల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు ఆరోపించారు. గజ్వేల్ మండలం కొల్గూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ మల్లం రాజు సతీమణి మల్లం సుమతి, మాజీ ఉప సర్పంచ్ మల్లేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సత్తయ్యగౌడ్, ఇతర నేతలు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు 60 గజాలు మాత్రమే ఉండాలని, పైన ఇంకో ఇల్లు కట్టకూడదన్నది కాంగ్రెస్ పార్టీ విధానమని, కానీ బీజేపీ పార్టీ దీనిని వ్యతిరేకిస్తోందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్‌ముదిరాజ్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, సీనియర్ నాయకులు రాంరెడ్డి, నలగామ శ్రీనివాస్, ఎరుపుల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగం సత్తయ్య, మాజీ సర్పంచ్ నత్తి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అమర్‌నాథ్‌లో సేవ పూర్వజన్మ సుకృతం

- సిద్దిపేట సేవా సమితి సభ్యులు

సిద్దిపేట కల్చరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అమర్‌నాథ్‌లో యాత్రికుల కోసం సిద్దిపేట అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అన్నప్రసాద వితరణ కొనసాగుతోంది. అమర్‌నాథ్‌లో 13 రోజులుగా సేవలందించిన సేవా సమితి అధ్యక్షుడు కాచం కాశినాథ్, కార్యవర్గ సభ్యులు చింత శ్రీనివాస్, గౌరవ సభ్యులు కార్తివాడ శ్రీకాంత, పండిత రాంబహద్దూర్ తిరిగి స్వస్థలం చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అమర్‌నాథ్ యాత్రికులకు సేవ చేసే భాగ్యం కలగడం పూర్వజన్మ సుకృతమని, జీవితంలో ఒక్కసారైనా అమర్‌నాథ్ చెంత సేవలందిస్తే జన్మకు సార్థకత లభిస్తుందని అన్నారు. యాత్రికులు భోజనం స్వీకరించి ఇచ్చిన ఆశీస్సులు గొప్పగా గుర్తుండిపోయాయని పేర్కొన్నారు. రెండవ విడత సేవ కోసం సమితి ప్రధాన కార్యదర్శి గంజి రాములు, ఉపాధ్యక్షుడు అయిత రత్నాకర్ అమర్‌నాథ్‌లోని బాల్తాల్ చేరుకున్నారని సేవా సమితి చైర్మన్ చీకోటి మధుసూదన తెలిపారు. మొదటి విడతలో సేవలందించి స్వస్థలం చేరుకున్న సభ్యులకు సేవా సమితి కోశాధికారి గోపిశెట్టి శరభయ్య, పీఆర్వో మాంకాల నవీన్‌న కుమార్ స్వాగతం పలికారు.



స్వస్థలం చేరుకున్న సేవా సమితి సభ్యులు

బీజేపీకి పంజా విజయ్ రాజీనామా

- నేడు కాంగ్రెస్‌లో చేరిక..!



పంజా విజయ్ కుమార్

రామాయంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడి, మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పంజా విజయ్ కుమార్ బీజేపీకి రాజీనామా చేశారు. బుధవారం సాయంత్రం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు రాజీనామా లేఖ పంపారు. గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుతో పంజా విజయ్ టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. బీసీలకు అన్యాయం జరుగుతున్నందునే బీజేపీని వీడుతున్నట్లు ఆయన ఆంధ్రజ్యోతితో తెలిపారు. నిజాంపేటకు చెందిన పంజా విజయ్ 2017లో బీఆర్ఎస్‌లో చేరారు. ఆ తర్వాత జడ్పీటీసీగా గెలిచి 2022లో ఆ పార్టీని వీడి బీజేపీకి దగ్గరయ్యారు. ఎమ్మెల్యే సీటు ఇచ్చినా గెలవలేక పార్టీనే విమర్శిస్తావా అంటూ బీజేపీ రాష్ట్ర నాయకులు రాగి రాములు పంజా విజయ్‌పై మండిపడ్డారు.

● నిజాంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పూటకో పార్టీని మారేటోళ్లకు బీజేపీపై మాట్లాడే స్థాయి లేదని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంజా విజయ్‌కుమార్ బీజేపీలో పని చేస్తూ కాంగ్రెస్ బీఆర్ఎస్‌కి ఏజెంట్‌గా మారి చీకటి ఒప్పందలు చేసుకొని పార్టీని భ్రష్టు పట్టించే చర్యలు చేశారన్నారు. అతడి రాజీనామాతో బీజేపీకి జరిగే నష్టం ఏమీ లేదన్నారు. నాయకులు చంద్రశేఖర్, నరేష్, రమేష్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యా బోధనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- ఆదర్శ పాఠశాల అదనపు డైరెక్టర్ శ్రీనివాస చారి



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు డైరెక్టర్ శ్రీనివాస్ చారి

చిన్నశంకరంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యా బోధనపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలంగాణ ఆదర్శ పాఠశాల రాష్ట్ర విద్యాశాఖ అదనపు డైరెక్టర్ శ్రీనివాస్ చారి అన్నారు. బుధవారం ఆయన చిన్నశంకరంపేట తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించారు. ఇంటర్ విద్యార్థులను పాఠ్యాంశాలను అడిగి తెలుసుకొని, విద్యాభ్యాసంపై పలు సూచనలు అందించారు. అనంతరం ఉపాధ్యాయులతో సబ్జెక్టుల వారీగా సమీక్షించి, పాఠశాల రికార్డులను పరిశీలించారు. పాఠశాల కనీస వసతులపై ప్రిన్సిపాల్ వాణితో సమీక్షించి, విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఆదర్శ పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దుర్గా ప్రసాద్, ఏఎంఓ ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ లింగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల నియామకంలో జాప్యంపై నిరసన

సంగారెడ్డి అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రెగ్యులర్ ల్యాబ్ టెక్నీషియన్ల నియామక ప్రక్రియలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని పరీక్ష రాసిన అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదట వేసిన ఉద్యోగం ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 అని వారు గుర్తు చేశారు. గత మార్చి 10న ఫలితాలు విడుదల చేసిన మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇప్పటివరకు కేవలం ప్రొవిజనల్ జాబితా మాత్రమే విడుదల చేయడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఫైనల్ మెరిట్ లిస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపై స్పష్టత లేదని పేర్కొన్నారు. నియామకాల జాప్యాన్ని నిరసిస్తూ ఈ నెల 18న హైదరాబాద్‌లోని మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు అభ్యర్థులు తెలిపారు. నియామక ప్రక్రియను యుద్ధప్రాతిపదికన, పారదర్శకంగా పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఎం ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జేమ్స్, ఆనంద్‌కుమార్, భాస్కర్, కరుణజ్యోతి కోరారు.

పథకాల అమలు తీరును పరిశీలించిన కేంద్ర బృందం

మనోహరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ బృందం గ్రామాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకోవడానికి గౌతోజిగూడ గ్రామాన్ని సందర్శించింది. జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం ఈ నెల 15 నుంచి 23 వరకు జిల్లాలో పర్యటించనుంది. మనోహరాబాద్ మండల కేంద్రంలోని గౌతోజిగూడ గ్రామంలో బుధవారం కేంద్ర బృందం పర్యటించింది. గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పీఎం ఆవాస్ యోజన, ఉపాధి హామీ పనులు, ఎస్‌హెచ్‌జీ పనులను పరిశీలించారు. జీపీ రికార్డులను కూడా పరిశీలించారు. ఈ పర్యటనలో ఎన్‌ఎల్‌ఎం టీం సభ్యులు సురంజన రెడ్డి, డీఆర్‌డీఏ హెచ్‌ఆర్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, పీఆర్డీ విజయప్రకాష్, ఏఈ స్మైలీ, ఏపీవో ఆదినారాయణ, ఈసీ లక్ష్మీనారాయణ, తాజీమాజీ, ఉప సర్పంచ్ రేణు కుమార్, కార్యదర్శి నవీన్, టీఏ జగపతి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



గౌతోజీగౌడా గ్రామంలో కేంద్ర బృందం

శిల్పకు అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు



నారాయణఖేడ్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ, ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన మలమంచి శిల్ప టాపర్‌గా నిలిచింది. ఈ మేరకు మంగళవారం యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా బంగారు పతకంతో పాటు అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మలమంచి శిల్ప మాట్లాడుతూ, గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

మట్టి గుట్టను పరిశీలించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మనోహరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండల కేంద్రంలో అక్రమ మట్టి తవ్వకాలపై 'తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన సంబంధిత అధికారులు బుధవారం మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామ శివారులోని మట్టి గుట్టలను సందర్శించారు. జిల్లా మైనింగ్‌శాఖ ఆర్ఐ లక్ష్మీనారాయణ మట్టి తరలిస్తున్న గుట్టను పరిశీలించారు. అనుమతికి మించి మట్టిని తరలించరా లేదా కోణంలో క్షుణ్ణంగా పరిశీలించి, మట్టిని తరలించిన ప్రాంతాన్ని టేప్‌తో కొలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతికి మించి మట్టిని తరలిస్తే అనుమతి రద్దు చేసి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



ప్రభుత్వ కార్యాలయాలకు.. సొంత భవనాలు ఇంకెప్పుడు?

- నారాయణరావుపేట మండలం ఏర్పాటై ఆరేళ్లు
- పాఠశాల భవనంలో అరకొర వసతుల మధ్య ప్రధాన కార్యాలయాలు
- వేర్వేరు మండలాల్లో వివిధ శాఖలు
- భవన నిర్మాణాలకు స్థలాలున్నా నిధులు విడుదల చేయని వైనం
- ఇబ్బందుల్లో సిబ్బంది, ప్రజలు



ప్రాథమిక పాఠశాల భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్, మండలప్రజా పరిషత్ కార్యాలయాలు

సిద్దిపేట రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా నారాయణరావుపేట మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించ లేదు. దీంతో అరకొర వసతుల మధ్య ప్రాథమిక పాఠశాల భవనంలోనే అధికారులు సేవలందిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలకేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంతభవనాల ఏర్పాటు గురించి ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు పట్టించుకోకపోవడంతో సరైన వసతులు లేక సిబ్బంది, మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సొంతభవనాల ఊసే లేదు..

సిద్దిపేట నియోజకవర్గంలోని నారాయణరావుపేట మండల కేంద్రాన్ని 2019లో ఏర్పాటు చేశారు. మండల పరిషత్, తహసీల్దార్, వ్యవసాయ, ఐకేపీ కార్యాలయాలతో మండల కేంద్రంలో సేవలను ప్రారంభించారు. ఈ క్రమంలో గుర్రాలగొంది గ్రామంలో విద్యుత్‌శాఖ సెక్షన్ కార్యాలయం ప్రారంభించారు. వీటితో పాటు వివిధ మండలస్థాయి కారాలయాలు మండల కేంద్రంలో ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యమో లేక అధికారుల పట్టింపులేనితనమోగానీ ఆయా శాఖల కార్యాలయాలు సిద్దిపేట, చిన్నకోడూరు మండలాల్లోనే కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణం పై ఆయా పార్టీల నాయకులు ఊసెత్తకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మండలం ఉన్నట్టు మంత్రికే తెలియదా?

ఇటీవల నారాయణరావుపేట మండల కేంద్రంలో ఓ ఫంక్షన్‌కు హజరైన సిద్దిపేట జిల్లాలోని మంత్రి ఇది మండలమా.. నారాయణరావుపేట మండలం నాకు తెలియదన్నట్లుగా మాట్లాడడం పట్ల అధికార పార్టీ నాయకులు ఒకింత ఆందోళనకు గురైనట్లు తెలిపారు. సదరు మంత్రి తన నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో ఏర్పడిన నూతన మండలానికి పక్కా భవనాలు నిర్మించేందుకు సుమారు రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేసుకుని జిల్లాలో కొత్తగా ఏర్పడిన మండలాల్లో పక్కా భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నట్లు సమాచారం.

ఇరుకు గదుల్లో కార్యాలయాలు

నారాయణరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు ఇరుకు గదుల్లో కొనసాగడంపై సిబ్బంది, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పాఠశాల భవనంలో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. దీంతో కార్యాలయాలకు అవసరమయ్యే సౌకర్యాలు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతుండగా, టాయిలెట్స్ ఇతర సౌకర్యాలు సరిగా లేక ఆయా గ్రామాలనుంచి వచ్చే ప్రజలకు సైతం కష్టాలు తప్పడంలేదు. అధికార, ప్రతిపక్షాల నాయకులు, ప్రజాప్రతినిధులు పరస్పర విమర్శలు చేసుకోవడంతోనే కాలం వెళ్లదీయడంతో ఇక ప్రభుత్వ కార్యాలయాల్లో సౌకర్యాలను పట్టించుకునేదెవరని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధిలో రాష్ట్రానికే ఆదర్శంగా ఉన్న సిద్దిపేట నియోజకవర్గంలోని ఈ మండలంలో ప్రభుత్వ కార్యాలయాల దుస్థితిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ స్థలాలు ఉన్నా..

నారాయణరావుపేట మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించేందుకు ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికీ నిధులు మంజూరు చేయడంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం శాపంగా మారింది. ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు వచ్చినా స్పందన కరువైంది. కొన్ని నెలల క్రితం ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు పరిశీలించాలని నారాయణరావుపేట మండల కేంద్రానికి చెందిన కొందరు యువకులు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సైతం అందజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మండలంలో శాశ్వత భవనాలు నిర్మించేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బీఆర్ఎస్ దారిలోనే కాంగ్రెస్



బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు నిధులు కేటాయించలేదు. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం నారాయణరావుపేట మండలాన్ని నిర్లక్ష్యం చేస్తున్నది. గత ప్రభుత్వం విఫలమైనందున, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ప్రభుత్వ కార్యాయాల ఏర్పాటుకు నిధులు మంజురు చేయాలి

- ఎం. శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు

నిధులు మంజూరు చేయాలి



నారాయణరావుపేట మండల కేంద్రం ఏర్పడి ఆరేళ్లు గడుస్తున్నా సరైన వసతులు లేకపోవడం శోచనీయం. దీంతో ఆయా కార్యాలయాల సిబ్బందితో పాటు మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నందున నిధులు కేటాయింపులో జాప్యం జరగకుండా ప్రభుత్వం, జిల్లా మంత్రి, అధికార పార్టీ నాయకులు తగిన చర్యలు తీసుకోవాలి.

- బి.శంకర్, బీఎస్పీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి

ఘనంగా ఆషాఢ బోనాలు



నంగునూరులో బోనాల ఊరేగింపులో పద్మశాలీ మహిళలు

నంగునూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని పద్మశాలీ సమాజం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా పద్మశాలీ సమాజం ఆధ్వర్యంలో సుమారు 100 మంది మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ఊరేగింపు తీసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆషాఢ మాసంలో కులాలవారీగా ఒక్కోరోజు చొప్పున బోనాలు తీయడం ఆనవాయితీగా వస్తున్నది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వరుణుడి కరుణ కోసం కప్పతల్లి ఆటలు

హుస్నాబాద్‌రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వర్షాలు సమృద్ధిగా కురిపించి పంటలను కాపాడాలని కప్పతల్లి ఆటలు, గ్రామదేవతలకు జలాభిషేకాలు చేస్తు వర్షదేవున్ని వేడుకుంటున్నారు. బుధవారం హుస్నాబాద్ మండలం కూచనపల్లి గ్రామంలో గ్రామ దేవతలకు జలాభిషేకం చేసి గ్రామంలో కప్పతల్లి ఆటలు ఆడుతూ వరుణ దేవుడిని ప్రార్థించారు. వర్షాకాలంలో ఎండలు మండిపోతున్నాయని, వేసిన పంటలు ఎండిపోకుండా కాపాడాలని దైవాన్ని మొక్కుకున్నారు.

ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని కష్టపడి చదవాలి

హుస్నాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని వాటి సాధన కోసం కష్టపడి చదువాలని హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు జరిగిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో మాట్లాడారు. మున్సిపాలిటీ తరపున ఈ కళాశాలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.

న్యూస్ బాక్స్

గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా బదిలీ

గజ్వేల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదాను బదిలీ చేస్తూ మల్టిజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాదిన్నర కాలంగా గజ్వేల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బి. సైదా స్థానంలో నిజామాబాద్ జిల్లాలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వి. రవికుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు రేబర్తిలో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్

మద్దూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నేడు మద్దూరు మండలంలోని రేబర్తిలో వ్యవసాయ, ఉద్యాన, ఆయిల్‌పామ్ శాఖ ఆధ్వర్యంలో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి రామకృష్ణ తెలిపారు. ఏవో మాట్లాడుతూ.. రేబర్తి గ్రామంలో ఆయిల్‌పామ్ సాగు కోసం చిలుకూరి రవీందర్, శరత్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో 22 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజాప్రతినిదులు హజరై విజయవంతం చేయాలని కోరారు.

వ్యాధుల నివారణపై అవగాహన

మద్దూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బా పాఠశాల, మోడల్‌స్కూల్ తో పాటు హాస్టల్ విద్యార్థులకు వర్షాకాలం దృష్ట్యా స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రజిత మాట్లాడుతూ.. వ్యక్తిగత శుభ్రతతో పాటు చేతుల శుభ్రత పాటించాలన్నారు.

మాజీ ప్రధాన అర్చకుడి కన్నుమూత



మల్లప్ప(ఫైల్)

కొమురవెల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ మాజీ ప్రధాన అర్చకుడు పడిగన్నగారి మల్లప్ప(80) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. దాదాపు 50 ఏళ్ల పాటు ఆలయంలో అర్చకుడిగా సేవలందించి 2009లో పదవీ విరమణ చేశారు. ఆయనకు నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. ఆయన మృతి పట్ల ఆలయ ఈవో, సిబ్బంది, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, స్థానచార్యులు మల్లయ్య,అర్చక,ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు, బొద్దుల కనకయ్య, మహదేవుని శ్రీనివాస్, స్థానిక నాయకులు, గ్రామస్థులు సంతాపం తెలిపారు.

మాజీ వీఆర్‌వో మృతి



మల్లప్ప(ఫైల్)

కుకునూరుపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి):లకుడారం గ్రామానికి చెందిన యేళ్ల వెంకట్ రెడ్డి(85) గతంలో పలు గ్రామాల్లో వీఆర్‌వోగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. కొంతకాలంగా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మృతి చెందారు. వెంకట్‌రెడ్డికి ఇద్దరు కుమారులు ఓ కుమార్తె ఉన్నారు.

ప్రకృతి ఒడి.. సర్కారు బడి



కొమురవెల్లి మండలం తపాస్‌పల్లిలో పొలంలో వరి నాట్లు వేస్తున్న విద్యార్థులు



కుకునూరుపల్లి: చిన్నకిష్టాపూర్‌లో జీలుగ పంట గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఉపాధ్యాయుడు

కొమురవెల్లి/కుకునూరుపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించడం తెలిసిందే. అయితే పలు సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల చొరవతో విద్యార్థులు ప్రకృతి ఒడినే బడిగా మార్చుకుని పాఠాలు నేర్చుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వినూత్నరీతిలో బోధనను విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశంసించడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే.. కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం గ్రామంలోని ఓ రైతు పొలంలో నాట్లు వేసి సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.డీ అష్రఫ్ మాట్లాడుతూ.. అనుభవం ద్వారా నేర్చుకునే విషయాలు విద్యార్థులకు ఎక్కువకాలం గుర్తుంటాయన్నారు. సహ పాఠ్య ప్రణాళికలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పొలంలోకి దిగి ఉత్సాహంగా నాట్లు వేశారు. అనంతరం విద్యార్థులు రైతులతో ముచ్చటించి వరినారు పెంపకం, నాటు వేసే విధానం,సాగు పద్ధతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కుకునూరుపల్లి మండలం చిన్నకిష్టాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ప్రశాంత్‌గౌడ్ బుధవారం 5వ తరగతి విద్యార్థులకు తాను బోధించే పర్యావరణ శాస్త్రం గురించి నేరుగా ప్రకృతి ఒడిలోనే బోధించారు. వ్యవసాయ క్షేత్రానికి విద్యార్థులను తీసుకువెళ్లి వివిధ పంటలు ఏ విధంగా పండిస్తారో, వాటి సాగు విధానాలు, ఆయా పంటల సాగులో రైతుల సాధక బాధకాలను విద్యార్థులకు అర్థమయ్యేలా ప్రత్యక్షంగా తెలియజెప్పారు.

మూడు రోజుల్లో రైతులకు నీళ్లు వదలకుంటే మేమే ఓపెన్ చేస్తాం



కొడకండ్లలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడి

గజ్వేల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల్లో మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ద్వారా కాలువల్లోకి నీటిని విడుదల చేయకుంటే మాజీ మంత్రి హరీశ్‌రావు సారథ్యంలో తామే ఓపెన్ చేస్తామని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మండలం కొడకండ్లలోని ఎస్కేప్ రెగ్యులేటర్ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాను ఉద్దేశించి ప్రతాప్‌రెడ్డిని మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తూ కాలయాపన చేయకుండా మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ల ద్వారా నీటిని కాలువల్లోకి వదిలి, పంటల సాగుకు సహకరించేవారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కక్షపూరితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. వానలు పడక ఇబ్బందులు పడుతున్న రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లో నీళ్లున్నా రైతాంగానికి విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. వెంటనే నీటిని విడుదల చేయాలని లేని పక్షంలో మూడు రోజులలో మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ గేట్లను రైతులతో కలసి ఓపెన్ చేస్తామని, రాజీవ్ రహదారిపై పదివేల మంది రైతులతో ధర్నాకు దిగి, రోడ్డును దిగ్బంధిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్య, నాయకులు మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, పండరి రవీందర్‌రావు, నాగిరెడ్డి, కొడిత్యాల భాస్కర్, దయాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, మోహన్‌బాబు, రాములు, శ్రీనివాస్, గొడుగుస్వామి, బాల్‌చంద్రం, పాల రమేశ్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్



సిద్దిపేట అర్బన్: పొన్నాలలో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేస్తున్న పూజల హరికృష్ణ

సిద్దిపేట అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల సొంతింటి కల నేరవేరుతుందని సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం పనులకు ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట అర్బన్ మండలం అధ్యక్షుడు భిక్షపతి, సత్యనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పనులను వేగవంతంగా చేయాలి: జడ్పీ సీఈవో

మద్దూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులను త్వరితగతిన ప్రారంభించాలని జడ్పీ సీఈవో రమేష్ లబ్ధిదారులకు సూచించారు. బుధవారం మద్దూరు మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో పలువురు లబ్ధిదారుల ఇళ్లకు ఆయన భూమిపూజ చేశారు. గ్రామంలో పనుల ప్రగతిని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం నర్సరీని సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్. రాంమోహన్, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్, పంచాయతీ కార్యదర్శితో పాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఇష్టారాజ్యం



ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించిన బీఆర్ఎస్ నేతలు

నంగునూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బుధవారం నంగునూరు మండల పరిషత్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. గ్రామాలవారీగా అర్హులైన వారికి ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరైనప్పటికీ ప్రొసీడింగ్ ఇవ్వడంలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే కోటా కింద మంజూరైన ఇళ్లకు సంబంధించి ప్రొసీడింగ్ కాపీలను అధికారులు ఇవ్వడం లేదని మండిపడ్డారు. లబ్ధిదారుల ఎంపిక స్థానిక మాజీ ప్రజాప్రతినిధుల సమక్షంలో ఎంపిక ప్రక్రియ జరిగినప్పటికీ, స్థానిక తాజా మాజీ ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడంలో అంతర్యం ఏమిటని అగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కోటాలో మంజూరైన ప్రొసీడింగులను కాంగ్రెస్ కార్యకర్తలకు ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. గట్ల మల్యాల, రాంపూర్, తిమ్మాయిపల్లి తదితర గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ.. తమ గ్రామంలో అర్హులైన వారికి ఇల్లు కేటాయించినప్పటికీ ప్రొసీడింగ్‌లు ఇవ్వడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నంగునూరు సొసైటీ చైర్మన్ కోల రమేష్ గౌడ్, పరశురాములు గౌడ్, శ్రీశైలం యాదవ్, కృష్ణ, వేణు, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.



ఏఈఈవోకు చెక్కు అందిస్తున్న స్వప్ననవీన్ యాదవ్ దంపతులు

సత్రం నిర్మాణానికి రూ. 15లక్షల విరాళం

కొమురవెల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న 100 గదుల సత్రం నిర్మాణంలో భాగంగా ఒక గది నిర్మాణానికి హైదరాబాద్ కాచిగూడకు చెందిన అందెల స్వప్న నవీన్ యాదవ్ దంపతులు బుధవారం ఆలయ ఏఈవో శ్రీనివాస్‌కు రూ.15 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా సత్రం నిర్మాణానికి సహకరించి చెక్కును అందించిన అందెల స్వప్ననవీన్ యాదవ్ దంపతులకు ఆలయ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగంపల్లి శ్రీనివాస్,ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్,హైద్రాబాద్ యాదవ సంఘం నాయకుడు బండారి దుర్గరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి: డీఈవో



కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతన్న డీఈవో

దుబ్బాక, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదవడం ద్వారా మంచిఫలితాలను సాధించవచ్చునని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం దుబ్బాక మండలం అప్పనపల్లి, హసన్‌మీరాపూర్, పెద్దగుండవెల్లి, దుంపలపల్లి, చెల్లాపూర్, మల్లాయిపల్లి ప్రభుత్వ పాఠశాలను, జడ్పీహెచ్ఎస్ పాఠశాలతోపాటు దుబ్బాకలోని కేజీబీవీ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వెంట ఎంఈవో ప్రభుదాస్ తదితరులున్నారు.

పదోన్నతులు,బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలి: పీఆర్టీయూ

సిద్దిపేట రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు ఎర్రవెల్లి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నారాయణరావుపేట మండలం శనిగకుంట, మాటిండ్ల, జక్కాపూర్‌తో పాటు పలు పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి కొమ్మూరి పద్మ, నాయకులు లక్ష్మి నారాయణ, నాజీబ్ బాబా, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంపల్లి రోడ్డు బాగు కోసం బీఆర్ఎస్ నేత ఆర్థికసాయం

కొండపాక, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లి రోడ్డును పాలకులు పట్టించుకోకపోవడంతో గ్రామస్థులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బాగు చేసుకుంటున్న సంగతి తెలిసిందే. తలా కొంత డబ్బు జమ చేసి రోడ్డు ఇరుపక్కల ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంతోపాటు గుంతలను పూడ్చుకుంటున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి బుధవారం గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. తనవంతుగా రూ. 5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అంతకుముందు బందారం గ్రామంలో పలువురు బి ఆర్ ఎస్ కార్యకర్తల కుటుంబీకులు మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

మద్దూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తే నియోజకవర్గ ఎమ్మెల్యే మంజూరు చేశారని తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని దూళిమిట్ట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోల సాయిలు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అబద్దాలను ప్రచారం చేయడంలో ముందు వరుసలో నిలిచే నాయకులు వాస్తవాలను తెలుసుకోవాలన్నారు.

బీఆర్ఎస్ నాయకుల తీరు అర్థరహితం

చేర్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పేదలకు గూడు కల్పించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో బీఆర్ఎస్ పాత్ర శూన్యమని యూత్ కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ అధ్యక్షుడు కర్ర సంతోశ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఝొట్కూరి కమలాకర్ పేర్కొన్నారు. బుధవారం చేర్యాల మండలకేంద్రంలోని షాదీఖానాలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చొరవతో నియోజకవర్గ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు తమ గొప్పగా చిత్రీకరించుకుని క్షీరాభిషేకాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

అసంఘటిత కార్మికుల బోర్డును పునరుద్ధరించాలి



మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతి పత్రం ఇస్తున్న భారతీయ మజ్దూర్‌సంఘ్ నేతలు

సిద్దిపేట అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని అసంఘటిత రంగ కార్మికుల బోర్డులను పునరుద్ధరించడానికి కనీస వేతనాల జీవోలను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ తెలంగాణ రాష్ట్ర కమిటీ నాయకులు మల్లేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్మిక మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతి పత్రం అందజేశారు.

కొమ్మూరి కృషితో సబ్‌స్టేషన్లు మంజూరు

చేర్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కృషితో చేర్యాల మండలం చుంచనకోట, దానంపల్లి గ్రామాల్లో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని కాంగ్రెస్ చేర్యాల మండలాధ్యక్షుడు కొమ్ము రవి అన్నారు. ఈ మేరకు బుధవారం చేర్యాలలో విలేకరులతో ఆయన మాట్లాడారు. చేర్యాల ప్రాంత ప్రజలు, రైతాంగానికి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రెండు గ్రామాలలో సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఈ మేరకు స్థలసేకరణ పూర్తిచేసి ప్రతిపాదించినట్టు తెలిపారు.

షీటీమ్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన

కొమురవెల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేచరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం షీటీమ్, స్థానిక పోలీసులు మహిళా రక్షణకు గల చట్టాలు, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఎస్ఐ రాజుగౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియాలోని మోసపూరిత ప్రకటనలను నమ్మి మోసపోవద్దని సూచించారు.

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

కొండపాక, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం జప్తి నాచారం శివారులో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం రాత్రి మండలంలోని మర్పడగ గ్రామానికి చెందిన కిషన్(29) అనే వ్యక్తి బైక్‌పై వెళ్తూ జప్తి నాచారం శివారులో దుద్దెడ తొగుట రహదారిపై రోడ్డుపై పడి ఉన్న చెట్టును ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. సిద్ధిపేట ఆస్పత్రిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కరువు మండలాలుగా ప్రకటించాలి.

కొండపాక, జూలై 16 : కొండపాక, కుకునూర్‌పల్లి మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు సాగునీరు అందివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాల బండి శశిధర్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం మండల కమిటీ సమావేశం రవీంద్రనగర్ ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగింది. ప్రభుత్వం మల్లన్న సాగర్, తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా మండలాల్లోని చెరువులు, కుంటలు నింపి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.



మహిళల డప్పు నృత్యాలు

పార్టీని బలోపేతం చేద్దాం

(5వ పేజీ తరువాయి)

సూచించారు. పేద, బడుగు, బలహీన వర్గాల కోసం అనేక పోరాటాలు చేసిన చరిత్ర సీపీఐకి ఉందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర నేతలు శంకర్, వెంకటరమణారెడ్డి, మండల కార్యదర్శి గడిపె మల్లేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కేడం లింగమూర్తి, స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షులు పందిల్ల శంకర్, లోక్‌సత్తా నాయకులు మల్కిరెడ్డి మోహన్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాగీర్ సత్యనారయణ, వనేష్, శకర్, రాజ్‌కుమార్, జనార్దన్, సంపత్, పద్మ, లక్ష్మణ్ తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఒక స్తంభం ఉచితం

(5వ పేజీ తరువాయి)

రానున్నది. గృహజ్యోతి పథకం కింద ఉచితంగా అందించనున్న 200 యూనిట్లయితే గనుక అందుకు అర్హులుగా అధికారులు గుర్తించనున్నారు.

సిబ్బందికి, అధికారులకు నగదు ఇవ్వొద్దు



నూతనంగా ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులు, ఇంటి యజమానులు ఎవరూ కూడా విద్యుత్ సిబ్బందికి డబ్బు ఇవ్వొద్దు. కనెక్షన్ కోసం మేమే కడుతామని, తమకు డబ్బులివ్వాలని సిబ్బంది అడిగితే కూడా ఇవ్వొదు. వినియోగదారులకు సేవలు అందించేందుకు వినియోగదారుల సేవా కేంద్రాన్ని జిల్లా విద్యుత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేశాం. ఎవరైన డబ్బు అడిగితే సంబంధింత అధికారులకు తెలియజేయాలి.

- టీఆర్ చంద్రమోహన్, విద్యుత్ శాఖ ఎస్ఈ, సిద్ది పేట